
కథ

# భవిష్యత్తేమిటి?

డా. సి. ఆనందారామం



ఆఫీసులో ఏదో మీటింగులో ఉన్న భానుమతికి ఫోన్ వచ్చింది. ఆఫీసర్ పర్మిషన్ తీసుకుని ఫోన్ దగ్గరకు వెళ్లి, "హలో!" అంది.

"నేను మీ ఇంటిపక్క శకుంతలని మాట్లాడుతున్నాను. మీరు అర్జంటుగా రావాలి. మీ అమ్మాయిని వెంటనే హాస్పిటల్‌లో చేర్పించాలి!"

ఆవతలివైపు నుంచి వినిపించిన ఆ మాటలు వింటూనే కాళ్లూ, చేతులూ వణికాయి భానుమతికి.

"ఏం జరిగింది?" అంది పూడుకుపోతున్న గొంతుకతో ...

"మీరు వెంటనే రండి, అన్ని సంగతులూ తెలుస్తాయి!" అటువైపు నుంచి ఫోన్ పెట్టేసిన చప్పుడు.

భానుమతి కన్నీళ్లు ఆపుకుంటూ "సర్!" అని ఏదో చెప్పబోయేలోగానే ఫోన్‌లో భానుమతి మాటలు విని సంభాషణ ఊహించిన ఆఫీసర్, "నువ్వు వెళ్లమ్మా! వివరాలు తర్వాత చెప్పవచ్చులే!" అన్నాడు.

భానుమతి తన కైనటిక్ హోండామీద ఇంటికొచ్చింది. బెడ్రూమ్‌లో కింద పడుకుని ఉన్న పధ్నాలుగేళ్ల హారిణిని చూడగానే గుండె చెదిరింది. రక్తంతో తడిసిన బట్టలతో, ఒంటిమీద తెలివిలేకుండా పడి ఉంది హారిణి. శకుంతల హారిణి ముఖం తడిగుడ్డతో తుడుస్తోంది. ఏం జరిగిందో అర్థమైంది భానుమతికి.

"ఎవరు? ఇంత కిరాతకానికి పూనుకున్న దెవరు? ఎలా జరిగింది?" అంది ఏడుస్తూ.

"అవన్నీ తర్వాత, ముందు టాక్సీకి ఫోన్ చెయ్యండి హాస్పిటల్‌కి తీసుకెళ్దాం!"

అంది శకుంతల.

భానుమతి గొంతులో పొంగి వచ్చే ఏడుపును ఆపుకుంటూ టాక్సీకి ఫోన్ చేసింది. ఆదిత్యా ఫుడ్ సెంటర్‌కి ఫోన్ చేస్తే వాళ్ల ఆవరణలో ఉన్న టాక్సీని పంపిస్తారు. టాక్సీ వచ్చేసరికి హరిణికి తెలివి వచ్చింది. తల్లిని చేతులతో చుట్టేసి "మమ్మీ!" అని బావురుమంది.

భానుమతికి కూడా కన్నీళ్లు ఆగటంలేదు. ఏడుస్తూనే "ఎవరు?" అంది, క్రోధస్వరంతో ఆ ప్రశ్న వినగానే మరింత ఏడ్చింది హరిణి.

"ఇప్పుడా చర్చ వద్దు. ముందు అమ్మాయికి బట్టలు మారుద్దాం. గోరువెచ్చని నీళ్లల్లో స్పాంజి తడిపి తీసుకురండి, ఒళ్లు తుడుస్తాను!" అంది శకుంతల.

బట్టలకోసం హరిణి గదిలోకి వచ్చిన భానుమతి, అక్కడ కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్న నరహరిని చూసి విస్తుపోయింది. "నువ్వు ఇంట్లోనే ఉన్నావా?!" అంది.

నరహరి మాట్లాడలేదు.

"ఇంత జరిగినా నాకెందుకు ఫోన్ చెయ్యలేదు? ... అసలు నువ్వుండగా ఇదంతా ఎలా జరిగింది?" అంది. ప్రశ్న అడుగుతూండగానే, భానుమతికే సమాధానం స్ఫురించినట్లయింది. ఆమెకు గుండె ఆగినట్లయింది. నరహరి ముఖంలోకి తీక్షణంగా చూసింది. అతడు ఆమె చూపులను లక్ష్యపెట్టకుండా, రింగులుగా సిగరెట్ పొగ వదులుతున్నాడు.

"త్వరగా రండి!" పక్క గదిలోంచి అరిచింది శకుంతల.

ఇద్దరూ హరిణికి బట్టలు మార్చారు. తోలుబొమ్మలాగా వాళ్ల చేతులలో వేలాడింది హరిణి.

హాస్పిటల్‌లో చేర్చిన మూడు రోజులకి కాస్త కోలుకుంది హరిణి. కానీ ఎవరితోనూ మాట్లాడటంలేదు. తల్లి పలకరిస్తే చాలు, ఏడ్చేస్తోంది.

హరిణిని బుజ్జగించి, సమాధానపరిచి అడిగింది భానుమతి. "ఎవరూ? నరహరేనా?"

'అవును' అన్నట్లు తలాడించింది హరిణి.

"ఇలాంటివి ఒక్కసారిగా జరగవు. అతడు అంతకు ముందు కూడా వెకిలిగా ప్రవర్తించి ఉండాలి." భానుమతి కంఠంలో కూతురిమీద జాలితోపాటు, ఏదో అసూయ కూడా తొంగి చూసింది.

"అవును, చాలా చికాగ్గా ప్రవర్తించాడు, చాలాసార్లు."

"మరి, నువ్వు అప్పుడే నాకు ఎందుకు చెప్పలేదు?"

"నువ్వేగా! అతని మీద ... అదే ... అంకుల్‌మీద నేరాలు చెప్పొద్దని తిట్టావు?"

భానుమతికి గుర్తొచ్చింది.

***

దాదాపు ఏడాది కిందట వంటిల్లు సర్దుకుంటూంటే, హరిణి వచ్చి "మమ్మీ! అంకుల్ ... అంటూ ఏదో చెప్పబోయి ఆగింది. సామాను సర్దుకుంటూనే యాథాలాపంగా "ఏమిటి? చెప్పు?" అంది. అక్కడికి ఎప్పుడు వచ్చాడో, అతడు వంకర నవ్వుతో "బహుశా: నా మీద నేరాలు కాబోలు! నేను వెళ్లిపోనా?" అన్నాడు ఏమాత్రం కదలకుండా.

అప్పటికి అతడిని కలుసుకుని ఏడాది నిండింది. అతడిపట్ల తనకున్న ప్రేమని ప్రకటించుకోవాలని భానుమతి ఎంతో తాపత్రయపడుతున్న రోజులు. ఏం జరిగిందో, ఊహించనైనా ఊహించలేని భానుమతి కూతురి మానసిక పరిస్థితి అర్థం చేసుకోకుండా "అంకుల్ దగ్గర నీకూ, నాకూ రహస్యాలేమిటీ? చెప్పు!" అంది.

హరిణి మాట్లాడలేదు.

"చెప్పు!" అని మళ్లీ రెట్టించింది భానుమతి.

"నేను హాస్టల్‌లో ఉంటాను."

"అదేం?"

"అక్కడయితే చదువు సంధ్యలు మానేసి స్నేహితులతో తిరగొచ్చు!" అతడు వ్యంగ్యంగా అన్నాడు.

అతడిని చూస్తూంటే, హరిణికి తాను చదివిన డేవిడ్ కాపర్‌ఫీల్డ్ నవలలోని డేవిడ్ కాపర్‌ఫీల్డ్ సవతి తండ్రి గుర్తుకొచ్చాడు.

"హాస్టల్‌కి వద్దు. ఇక్కడే ఉండి చదువుకో! నేనూ, అంకుల్ నీకు తెలియనివి చెప్తూంటాము!" అంది భానుమతి.

"వద్దు! అంకుల్ నా గదిలోకి రావద్దు!" చికాకుగా అంది హరిణి.

అతడి ముఖం ఎర్రబడింది.

భానుమతి తెల్లబోయింది.

"ఎందుకు రాకూడదూ? నా గాలి సోకితే నువ్వు మైలపడతావా?" అన్నాడు కఠినంగా. ఆ స్వరానికి భానుమతి భయపడింది. "తప్పు! అంకుల్‌తో అలా మాట్లాడకూడదు!" అంది భానుమతి.

"నీకు తెలియదు మమ్మీ! అతడు ... అతడు ..." ఏదో చెప్పటానికి ప్రయత్నించి చెప్పలేక మధనపడుతోంది హరిణి.

రగులుతున్న అతడి ముఖం చూసి భయంతో "అతడు ... అనకూడదు. అంకుల్ అనాలి. ఇంకెప్పుడూ అంకుల్ మీద నాకు నేరాలు చెప్పకు. పెద్దవాళ్లకు మర్యాద ఇవ్వటం నేర్చుకో!" అంది కఠినంగా.

హరిణి ముఖం చిన్నబుచ్చుకుని వెళ్లిపోయింది. ఆ ముఖం చూస్తే జాలేసినా, పక్కన అతడు ఉండగా ఏమీ అనలేకపోయింది. హరిణి చిన్నపిల్లలకు సహజమైన మనస్తత్వంతో తన తండ్రిస్థానంలో మరో వ్యక్తిని సహించలేకపోతోందని అనుకుంది.

***

"మమ్మీ! నాకు చాలా చీదరగా ఉంది. బాధగా ఉంది. ఈ శరీరం వదిలేసి ఇంకో శరీరం తెచ్చుకోవాలని ఉంది!" ఆపకుండా ఏడుస్తోంది హరిణి.

హరిణిని ఎలా ఓదార్చాలో, ఏ భాషలో ధైర్యం చెప్పాలో అర్థం కావటంలేదు భానుమతికి.

***

దాదాపు ఇరవై ఏళ్ల కిందట ... భానుమతికి ఉద్యోగం దొరికింది. ఇంటిల్లిపాదీ ఆనందించారు.



భానుమతి బోలెడు సంబరపడిపోయింది. "ఇంక మీ నాన్న కట్నాలు గుమ్మరించనక్కర్లేదు. నీ ఉద్యోగం చూసి నిన్ను కళ్లకద్దుకుని పెళ్లి చేసుకుంటారు!" అన్నారు, బంధుమిత్రులు. ఆ మాటలకి సరి అయిన అర్థం తెలియకపోయినా, ఏదో సాధించినట్లు పొంగిపోయింది. అనుకున్నట్లుగానే కట్నాలకోసం బేరం ఆడకుండా పెళ్లి కుదుర్చుకున్నారు. మగపెళ్లివారు కట్నం ఇయ్యక్కర్లేకపోయింది, కానీ పెళ్లి ఖర్చులూ, లాంఛనాలూ తప్పలేదు ఆడపెళ్లివారికి.

'ఉద్యోగం చూసి పెళ్లి చేసుకోవటం' అంటే, పెళ్లి అయ్యాక పూర్తిగా అర్థమైంది భానుమతికి. స్త్రీ ఉద్యోగస్తురాలు కావటం వల్ల ఆమెకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నట్లో, లేనట్లో అర్థం కాలేదు. తను సంపాదించే జీతంమీద తనకి అధికారం లేదు. జీతమంతా భర్తకియ్యవలసిందే! అతడి అనుమతి లేకుండా అర్ధ రూపాయి కూడా ఖర్చుపెట్టకూడదు. చివరికి చెల్లెలికో, తమ్ముడికో చాక్లెట్ కొన్నా విసుక్కుంటాడు. ఏదైనా మంచి చీరకొన్నరోజు, ఇంట్లో అలకలు 'ఆకలి లేదు' అంటూ ఇల్లు వదలి బయట తిరగటాలూ, వగైరా ... ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. ఇంటి చాకిరీతో శరీరానికి విశ్రాంతి లేదు. ఇవన్నీ చాలక, అర్ధరాత్రి వరకూ తిరిగి తిరిగి వచ్చి, అలసిపోయి నిద్రపోతున్న తనను నిర్దాక్షిణ్యంగా నిద్ర లేపేవాడు తన శరీరాన్ని మరింత హూనం చేసేవాడు. ఆ తర్వాత తనకు నిద్ర పట్టేది కాదు. నిద్రలేమితో ఆ మరునాడంతా తలనొప్పితో బాధపడేది.

ఈ పరిస్థితుల్లో గిరిజతో స్నేహమయింది. గిరిజ "ఇలాంటి భర్తతో నరకం అనుభవించవలసిన కర్మ నీకేమిటి? హాయిగా సంపాదించుకుంటున్నావు!" అంది. గిరిజ చివరి మాటలు తన మనసులో సుడి తిరిగాయి. అవును, తన సంపాదన! అర్ధ రూపాయి ఖర్చు చేసుకోవాలన్నా అరవై అబద్ధాలాడుకోవలసిందే తప్ప, స్వతంత్ర్యంగా ఖర్చు చెయ్యటానికి వీల్లేదు. ఎందుకుండాలి ఈ నరకంలో!

ఈ ఆలోచన భానుమతి మనసులో వామనుడిలా మొదలై త్రివిక్రముడిలా విజృంభించింది.

ఫలితంగా కూతురు హరిణిని తీసుకుని వేరే ఇంటికి వచ్చేసింది. ఇంతకు తెగిస్తుందని ఊహించని అతడు, మొదట బెదిరించాడు. తర్వాత బతిమాలాడు. దేనికీ భానుమతి చలించలేదు. తన సంపాదన తను సుఖంగా ఖర్చుపెట్టుకోవటానికి అలవాటుపడ్డ తర్వాత తిరిగి బానిసత్వంలోకి వెళ్లలేకపోయింది. ఒంటరిగా జీవించటానికి అలవాటు పడుతున్న రోజులలో నరహరి పరిచయమై ప్రేమ ప్రస్తావన తెచ్చాడు భానుమతికి నరహరి నచ్చాడు. కానీ, ముందు జాగ్రత్తగా "నా జీతంపై నీకు ఏ అధికారమూ లేదు. అలా అయితేనే పెళ్లి చేసుకుంటాను!" అంది.

"నాకు నీ జీతం అక్కర్లేదు. మనమధ్య పెళ్లి దేనికి? పెళ్లి అంటేనే, ఒకరి సంపాదనపైన మరొకరికి చట్టబద్ధమైన అధికారం వస్తుంది!" అన్నాడు నరహరి. ఆ మాటలతో బెదిరిపోయి పెళ్లి తంతు లేకుండానే అతడితో కలిసి ఉండటానికి ఒప్పుకుంది. అతడికి అంతకుముందే పెళ్లి అయిందనీ, పిల్లలు కూడా ఉన్నారనీ తెలిసింది. నరహరిని అడిగితే, "నీకు పెళ్లి కాలేదూ? నీ భర్తని నువ్వు వదలి వచ్చినట్లే నేనూ నా భార్యని వదలి వచ్చాను!" అన్నాడు.

"కానీ ఇంకా నువ్వు అక్కడికి వెళ్తున్నావు!" నిష్ఠూరంగా అంది.

"నీలాగే, నాకూ నా పిల్లలమీద ప్రేమ. వాళ్లకోసం వెళ్తున్నాను!"

మాట్లాడలేకపోయింది భానుమతి. ఎలాగైనా ఈ అనుబంధాన్ని నిలుపుకోవాలనే తాపత్రయం ఎక్కువయింది భానుమతిలో. కానీ అందుకు కన్న కూతురి జీవితం బలి చెయ్యవలసి వస్తుందని ఆమె ఊహించలేదు.

***

నరహరితో 'నా ఇంటి గడప తొక్కవద్దు!' అని భానుమతి చెప్పవలసిన అవసరం లేకపోయింది. అతడే ఆ ఇంటి ముఖం చూడలేదు.

హరిణి తనను తాను చీకటి గదిలో బంధించుకుంది. కాలేజీ మానేసింది. పుస్తకాలముందు కూర్చుంటుంది కానీ, కళ్లు చదువుతున్నట్లుగా ఉండవు. బయటికి వెళ్లదు. టీ.వీ. చూడదు. ఆ పసిపిల్లకు ధైర్యం చెప్పటానికి భానుమతికి నోరు రావటంలేదు. ఇంతటి అనర్థానికి తనే కారణమనే గిల్టీ కాన్షస్‌నెస్ ఆమె గొంతు నొక్కేస్తోంది. పోనీ మరెవరితోనైనా చెప్పిద్దామంటే, నరహరితో బాహాటంగా కాపురం పెట్టిన దగ్గరనుంచీ ఇంటికి స్నేహితులెవరూ రావటంలేదు. ఆఫీసులోనైనా మగవాళ్లు ఏదో కల్పించుకుని మాట్లాడతారే తప్ప, ఆడవాళ్లు అంతగా మాట్లాడరు. స్నేహితురాళ్లను ఇంటికి ఆహ్వానించకపోలేదు. ఏదో వంకతో తప్పించుకునేవారు. ఒకావిడ "మీ ఇంటికి వస్తే మా ఆయనతో గొడవ. నేను పడలేను. సారీ, నేను రాను!" అని కుండ పగలగొట్టినట్లు చెప్పేసింది.

అతి కష్టంమీద హరిణికి నచ్చజెప్పి తీసుకెళ్లింది. అదే షాపుకి నరహరి తన భార్యా బిడ్డలతో వచ్చాడు. భానుమతి తత్తరపడి తన ముఖం ఎక్కడ దాచుకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతుంటే, నరహరి నదురూ బెదురూ లేకుండా భానుమతిని సమీపించి "హలో! ఎలా ఉన్నావ్?" అని పలకరించాడు.

అతడి భార్య భానుమతినీ, హరిణినీ మింగేసేలా చూస్తోంది. అతడి కూతురు పదేళ్ల పిల్ల హరిణి కంటే చిన్నది, చరచర హరిణి దగ్గరకి వచ్చి "ఛీ! నీకు సిగ్గు లేదూ?" అంది.

నరహరి నవ్వుతూ, "తప్పు స్వీటీ! అలా అనకూడదు. ఐ యామ్ సారీ, హరిణీ! నీకే సహాయం కావలసినా తప్పకుండా చేస్తాను!" అన్నాడు.

హరిణి పిచ్చి చూపులు చూసింది. భానుమతి తల్లి గుండె తల్లడిల్లిపోయింది. శివమెత్తినదానిలా హరిణి చెయ్యి పట్టుకుని షాప లోంచి బయటకు ఈడ్చుకొచ్చి ఆటో మాట్లాడి, దానిలో కూర్చోబెట్టి తనూ కూర్చుంది.

ఇంటికొచ్చాక, భానుమతి నరహరిని "బ్రూట్! రాస్కెల్! స్కౌండ్రల్!" అని తిడుతుంటే హరిణి విరగబడి నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"అతడి భార్యా బిడ్డలతో అతడు షాపింగ్‌కి వస్తే తిట్టడం దేనికి? అతడు సుఖంగానే ఉన్నాడు. అక్కడ మా అసలు నాన్న మరెవరినో పెళ్లి చేసుకుని సుఖంగానే ఉండి ఉంటాడు. నువ్వూ ఉద్యోగం చేసుకుంటూ సుఖంగానే ఉంటావు. కానీ, నా భవిష్యత్తేమిటి?"

హరిణి కళ్లముందు అంధకారం! అర్థం కాని, భయంకరమైన అంధకారం!

■

### తేడా

"ఇలా మా హోటల్‌లో టిఫిన్ తిని పప్పు రుబ్బకపోతే...ఎంచక్కా మీరు ఇంట్లోనే టిఫిన్ చెయ్యొచ్చుకదా...ఎందుకీ శ్రమ?"అడిగాడు సర్వర్ సుందరం.

"ఇంటికన్నా ఇదే బెటరోయ్...అక్కడ టిఫిన్ తినేముందు పప్పు రుబ్బుతాను. ఇక్కడ తిన్నాక పప్పు రుబ్బుతాను...అంతే తేడా!" బదులిచ్చాడు వెంగళ్రావ్.

పి.వి. సుజాతారాయుడు,
సికిందరాబాదు